క్లుప్తంగా

శిథిలావస్థకు చేరిన వంతెన



శిథిలమవుతున్న వంతెన భాగం

నరసాపురం: పట్టణంలోని పాలకొల్లు రోడ్డులో ఉన్న మత్స్యపురి వంతెన శిథిలమైంది. నరసాపురం నుంచి మత్స్యపురి మీదుగా భీమవరం వెళ్లే వారు ఈ వంతెన మీదుగా ప్రయాణించాలి. దీంతో ఈ వంతెనను మత్స్యపురి వంతెనగా పిలుస్తారు. అయితే ఈ వంతెన దాదాపుగా శిథిల దశకు చేరింది. వంతెనపై మూడు చోట్ల గోతులు పడ్డాయి. సైడ్‌వాల్స్ కూడా శిథిలమయ్యాయి. కానీ వంతెనకు రోడ్లు భవనాల శాఖ ఎలాంటి మరమ్మతులు చేయడం లేదు. దీంతో ఈ వంతెన మీదుగా ప్రయాణించే వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా వంతెన మరమ్మతులపై దృష్టి పెట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గ్రామదేవతలకు ఆషాఢ సారె సమర్పణ

యలమంచిలి: కొంతేరు గ్రామ దేవతలు శ్రీ కనకదుర్గమ్మ, మావుళ్లమ్మ, మారెమ్మ అమ్మవార్లకు మంగళవారం పెద్ద సంఖ్యలో మహిళలు ఆషాఢం సారె సమర్పించారు. ఆలయ అర్చకులు కొంతేటి సర్వేశలింగం బ్రహ్మత్వంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లను కూరగాయలతో ప్రత్యేకంగా శాకంబరిగా అలంకరణ చేశారు. సారె తీసుకువచ్చిన భక్తులకు అర్చకులు ఆశీర్వచన చేయగా ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

పంట బీమాపై రైతులకు అవగాహన



పెనుగొండలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: పెనుగొండ, మునమరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంట బీమా ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. రైతులందరూ ఎకరాకు 210 రూపాయలను ప్రీమియంగా చెల్లిస్తే 42,000 వరకు బీమా పొందవచ్చని అధికారులు తెలిపారు. అలాగే నారుమడుల్లో, ప్రధాన పొలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

24న దివ్యాంగులకు ఉచిత ఉపకరణాల శిబిరం

ఉండి: నియోజకవర్గంలోని దివ్యాంగులకు ఉచితంగా పరికరాలు అందించేందుకు ఈ నెల 24న ఉండి, ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు మండలాల పరిధిలోని దివ్యాంగుల నిర్ధారణా కార్యక్రమాన్ని ఉండి జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎంవీఎస్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశబూరు. దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ కాళ్లు, చేతులు, వినికిడి సాధనాలు అందించేందుకు నిర్వహించే ఈ కార్యక్రమానికి వచ్చే దివ్యాంగులు తమ ఆధార్, సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు, రెండు ఫోటోలు తీసుకుని రావాలని కోరారు. ఉదయం 10 గంటలకు నుంచి శిబిరం ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం: ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకుని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్రర్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం రామచంద్రర్, షెడ్యూల్ కులాల జాతీయ కమిషన్ డైరెక్టర్ సునీల్ కుమార్‌బాబు సంయుక్తంగా జిల్లాలో వివిధ శాఖల ద్వారా షెడ్యూల్డ్ కులాలకు అమలు చేస్తున్న సబ్సిడీ బ్యాంకు రుణాలు, వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. జేసీ టి రాహుల్ కుమార్‌రెడ్డి, ఎంపీ పాక వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

మండుతున్న ఎండలతో విలవిల



బట్టలమగుటూరులో ముసుగులు ధరించి నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు



బట్టలమగుటూరు కెనాల్ నుంచి సాగునీరు అందక ఎండిపోతున్న పొలాలు

- ఎండ వేడిమితో పనిలోకి రాని రైతు కూలీలు
- దెబ్బతింటున్న నారుమడులు

గత వారం రోజులగా ఎండ తీవ్రతకు ప్రజలు చాలా ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా కాలువలకు నీళ్లు వదలడంతో వ్యవసాయం పనులకు రైతులు ఉపక్రమించారు. మొదట్లో వానలు పడడంతో వేగంగా పనులు చేశారు. అయితే క్రమేపి ఎండ తీవ్రత బాగా పెరుగడంతో ఎండవేడిమితో ఇబ్బందిపడుతున్నారు. చాలా మంది వ్యవసాయ కూలీలు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పనులను నిలిపివేస్తున్నారు. నారుమడుల్లో నీరు వేడెక్కి పల్లపు ప్రాంతాల్లో నారుమడులు దెబ్బతింటుండగా, మెరక ప్రాంతాల్లో దమ్ము చేసిన పొలాలకు నీరందక ఎండిపోతున్నాయి. రెండు మూడు రోజుల్లో వరినట్లు ముమ్మరం కానున్న పరిస్థితుల్లో ప్రస్తుతం ఉన్న వాతావరణం రైతులను నిరాశకు గురి చేస్తుంది. ఇప్పటికే వరి నాట్లు ఆలస్యమైన పరిస్థితుల్లో రైతులను వాతావరణం మరింత కుంగదీస్తుంది. రైతులకు ధాన్యం డబ్బు సకాలంలో అందక, ప్రభుత్వ పెట్టుబడి సహాయం లభించక రైతులు ఆందోళనకు గురవుతున్నారు. - పెనుమంట్ర



పెనుమంట్రలో మధ్యాహ్న సమయంలో చెట్ల నీడన సేదదీరుతున్న రైతు కూలీలు



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న మార్టేరు సెంటర్

17 నుంచి పాలీసెట్ తుది కౌన్సెలింగ్

నరసాపురం రూరల్: పాలీసెట్–2025 ఫైనల్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైందని స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్మయి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించే వారు ఈ నెల 17 నుంచి 19 వరకు చెల్లించవచ్చని, 18 నుంచి 20 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్, ఆప్షన్ నమోదు ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. 21న సీట్ కేటాయింపులు చేస్తారని వివరించారు. సీట్ పొందిన విద్యార్థులు ఈ నెల 24 లోపు రిపోర్ట్ చేయాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాల కోసం కళాశాల ఆఫీస్‌లో సంప్రదించాలని తెలిపారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎక్కడా కనిపించని కూటమి అభివృద్ధి



నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడాల గోపి

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో గానీ నియోజకవర్గంలో గానీ అభివృద్ధి అంతా మాటల్లో తప్ప చేతల్లో కనిపించడంలేదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నూతనంగా పదవులు అలంకరించిన సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా గుడాల గోపి మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయన్నారు. అక్కడక్కడ రోడ్ల మధ్యలో గుంతలు ఉండడం వల్ల ఓ మహిళ ఆ గోతిలో పడి చనిపోయిన సంఘటన చాలా దారుణమని అన్నారు. వరిదనం నుండి కాజ వెళ్లే మార్గం, పోడూరు మండలంలో మట్టపర్రు వెళ్లే రహదారి ఇలా ఎక్కడ చూసినా గుంతలతో వాహనదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ముందు రోడ్లు మరమ్మతులు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలన్నారు. ఈ సందర్భంగా లీగల్ సెల్ వింగ్ పిట్ట రాజ్‌కుమార్, ఐటీ వింగ్ అధ్యక్షులు కొండ గణేష్‌లను అభినందించారు. కార్యక్రమంలో యడ్ల తాతాజీ, కోరాడ శ్రీనివాస్, కోట రత్నరాజు, నక్క చిత్తరంజన్‌దాస్, బండి రమేష్, యాతం నానాజీ, కెల్లా పెద్దిరాజు, గానుబోయిన దుర్గారావు, రేలంగి శ్రీనివాస్, దేవ రాజేష్, పాలపర్తి కృపానాథ్, రాజా, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ వద్ద ప్రమాదకరంగా రోడ్డు

నరసాపురం: పట్టణంలోని ప్రధాన ప్రాంతం బస్టాండ్ పక్కరోడ్డు ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. నిత్యం వేలాది మంది ప్రయాణించే ఈ రోడ్డు గుంత పడిపోయింది. మున్సిపల్ అధికారులు నూతన రహదారి నిర్మించడం అటుంచి కనీసం గుంత కూడా పూడ్చకపోవడంతో ప్రయాణికులు ప్రమాదాలకు లోనవుతున్నారు. ఈ ప్రాంతంలో మోటార్ సైకిళ్లపై వెళ్లేవారు జారిపడిపోతున్నారు. ముఖ్యంగా స్కూటర్‌పై వెళ్లే మహిళలు వారంలో ఇద్దరు, ముగ్గురు పడిపోయి గాయాలపాలవ్వడం పరిపాటిగా మారింది. అటు బస్టాండ్ పక్క నుంచి 216 జాతీయ రహదారికి అనుసంధానంగా ఈ రోడ్డు ఉంది. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో స్థానిక వ్యాపారులు, ఫుట్‌పాత్ వ్యాపారులు కొందరు అక్కడక్కడ రాళ్లు పోగుచేసుకుని పూడ్చుకుంటున్నారు. మున్సిపల్ అధికారులు మాత్రం ఓ తట్టెడు మట్టి పోసే స్థితిలో కూడా లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

అనారోగ్య బాధితులకు మందుల అందజేత

పాలకొల్లు సెంట్రల్: స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆనారోగ్యంతో బాధపడుతున్న ఆరుగురు పేదలకు ఉచితంగా మందులు అందజేశారు. మంగళవారం స్థానిక కొత్త కుళాయి చెరువు గట్టు వద్ద బాధితులకు క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు సుమారు రూ. 30 వేలు విలువ చేసే మందులను అందించారు. ఆర్థికంగా ఇబ్బందులు పడే వారికి వాకర్స్ క్లబ్ సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పీర్ సాహెబ్, పోతుల ఉమా శంకరరావు, మానెం బసవరాజు, ధనాని శ్రీరామమూర్తి, జవ్వాజి కళ్యాణ్ పాల్గొన్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన

కాళ్ల: సాగులో పచ్చిరొట్ట ఎరువులు, కంపోస్టు వినియోగించడం వల్ల 15 నుంచి 20 శాతం వరకు ఎరువుల వినియోగం తగ్గించుకోవచ్చని కాళ్ల వ్యవసాయ అధికారి బి.రమేష్ నాయుడు తెలిపారు. కాళ్ల మండలం కోపల్లే గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సార్వా నాట్లు వేసే సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. సార్వా సాగులో ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా పచ్చిరొట్ట, జీలుగ, పిల్లి పెసర, జనుము వంటి వాటి ఉపయోగాల గురించి వివరించారు. అధిక నత్రజని వాడటం వల్ల కలిగే దుష్ప్రభావాలు గురించి వివరించారు. కార్యక్రమంలో జింకు, జిప్సం, పిల్లి పెసర, టార్పాలిన్‌లను సబ్సిడీపై ఇవ్వాలని రైతులు కోరినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీల నియామకం



గోరింటాడ వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ సభ్యులు



ఆగర్రు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: మండలంలో అతి త్వరలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీలను ఎంపికను పూర్తి చేస్తామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స ఏసురాజు అన్నారు. మంగళవారం మండలంలో ఆగర్రు, గోరింటాడ గ్రామాల్లో గ్రామ కమిటీలు నియమించారు. ఈ సందర్భంగా ఏసురాజు మాట్లాడుతూ పార్టీ నాయకులు తమ గ్రామాల్లో తిరిగి గ్రామంలో ఉన్న సమస్యలపై పోరాటం చేసి గ్రామ ప్రజలకు అండగా నిలబడాలన్నారు. ఆగర్రు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మేడిది చంద్రప్రసాద్, సెక్రటరీగా మోకా భాస్కరరావు, గోరింటాడ గ్రామ కమిటీ అధ్యక్షునిగా నక్కా సునీల్, సెక్రటరీగా దేనబోయిన అయ్యప్పలతో పాటు మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు మైలాబత్తుల మైఖేల్‌రాజు, పానకమట్ల వీరాస్వామి, రెడ్డిమాసు నాగేంద్ర, వర్ధినీడి శ్రీనివాస్, వైస్ ఎంపిపి పడవల సునీల్, తండా ఇస్సాక్ రాజు, తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గోపాలన్

పాలకొల్లు సెంట్రల్: ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్వి గోపాలన్ అన్నారు. మంగళవారం స్థానిక మహిళా భవనంలో మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ అధ్యక్షతన మండల పార్టీ సభ్యుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టే విధంగా అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయడంలో విఫలమయ్యారని అన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ చేసిన నిర్ణయాలను అమలు చేస్తూ ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు విశాఖ ఉక్కు ప్రైవేటు పరం కాకుండా అడ్డుకుంటామని బీరాలు పలికిన నాయకులు మోది ప్రయత్నాలను అడ్డుకోలేకపోతున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాన్ని అమలు చేయడంలో పూర్తిగా కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.వాసుదేవరావు, జవ్వాది శ్రీనివాస్, టి.శ్రీనివాసరావు, సీహెచ్ సోమేశ్వరరావు, వై.అజయ్‌కుమార్, పి.సాంబశివరావు పాల్గొన్నారు.

పెరుగుతున్న వశిష్ట గోదావరి నీటిమట్టం



వలందర్‌రేవులో పిండ ప్రధానం షెడ్డుపై వరకూ గోదావరి వరద నీరు చేరిన దృశ్యం

నరసాపురం: ఎగువప్రాంతం నుంచి వరదనీరు భారీగా వచ్చి చేరుతుండటంతో నరసాపురంలో వశిష్ట గోదావరి నీటి మట్టం భారీగా పెరుగుతుంది. గత మూడురోజుల నుంచి పరిస్థితిని గమనిస్తే రోజురోజుకూ నీటిమట్టం పెరుగుతుంది. వలందర్‌రేవులో మంగళవారం పిండ ప్రధానం షెడ్డుకు సమాంతరంగా నీటిమట్టం చేరింది. సముద్రం పోటు సమయంలో నీటి మట్టం మరింతగా పెరుగుతుంది. ప్రమాదకర పరిస్థితి నెలకొనడంతో వలందర్‌రేవులో భక్తులు స్నానాలకు దాగకూడదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అయితే రేవువద్ద మోటార్ల ద్వారా ఏర్పాటు చేసిన బాత్‌షవర్ వినియోగంలో ఉంచకపోవడంతో దూరప్రాంతాల నుంచి గోదావరి స్నానాలకు వచ్చేవారు, పిండ ప్రధానాల కోసం స్నానాలు చేయాల్సిన వారు ఇబ్బందులు పడుతున్నారు. నీటిమట్టం పెరిగినా పడవలరేవులో పంటు పాకపోకలు యథావిధిగా ప్రమాదకర పరిస్థితిల్లో కూడా కొనసాగిస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించకుండా ప్రజలు తిరస్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ పిలుపునిచ్చారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు తిరస్కరించాలని విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలని కోరుతూ మంగళవారం ఆచంట మండలంలో ఆచంట, పెద్ద పేట, చెమ్మచెరువు, మానేవారిపాలెం, బాల వారి పాలెం, శేషమ్మ చెరువు, వంకతాళ్ల చెరువు, పద్మనాభం చెరువు, తూర్పు పాలెం, కొనపోతుగుంట గ్రామాల్లో సైకిల్ ర్యాలీ నిర్వహించి అనంతరం ఆచంట కచేరి సెంటర్లో బహిరంగ సభ నిర్వహించారు ఈ సందర్భంగా స్మార్ట్ మీటర్ల వల్ల వచ్చే అనర్థాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గోపాలన్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు వద్దు పగలగొట్టండని చెప్పి కోర్టులో కేసులు వేసిన టీడీపీ నేతలు ఇప్పుడు ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి అనేక రూపాల్లో విద్యుత్ చార్జీలు పెంచుతున్నారని ధ్వజమెత్తారు. పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని ప్రజలు వినియోగించిన విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నప్పటికీ మళ్లీ సర్ చార్జీల పేరుతో రెండోసారి వసూలు చేయడం మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు, పోడూరు మండల కన్వీనర్ కాకర వెంకటేశ్వర్లు, పిల్లి ప్రసాద్, బత్తుల విజయకుమార్, తలుపురి బుల్లబ్బాయి, ఎస్‌వీఎన్ శర్మ, సిర్రా నరసింహమూర్తి, కుసుమే జయరాజు పాల్గొన్నారు.

శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణను ప్రారంభిస్తున్న దృశ్యం.

నరసాపురం రూరల్: శిక్షణలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని అంతర్జాతీయ లేస్ ట్రేడ్ సెంటర్ కన్వీనర్ కలవకొలను నాగతులసిరావు అన్నారు. మండలంలో రుస్తుంబాద గ్రామంలోని అంతర్జాతీయ లేస్ ట్రేడ్ సెంటర్‌లో హస్తకళల ఎగుమతి ప్రోత్సాహక సంస్థ (ఈపిసిహెచ్) ఆధ్వర్యంలో మంగళవారం గురు శిష్య హస్తశిల్ప్ పరిశిక్షన్ లేసు అల్లికలపై 50 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తులసిరావు మాట్లాడుతూ క్రోచెట్ లేస్, క్రాఫ్ట్‌పై శిక్షణ తీసుకుంటున్న మహిళలు స్వయంకృషితో అభివృద్ధి చెందాలన్నదే శిక్షణ ముఖ్య ఉద్దేశమన్నారు. శిక్షణకు హాజరైన మహిళలకు టూల్ కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హస్తకళలు, జౌళి మంత్రిత్వశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అపర్ణ లక్ష్మి, ఈపీసీహెచ్ సబ్ కమిటీ మెంబర్ అడ్డగళ్ల బాబు, 30 మంది లేసు అల్లికా మహిళలు పాల్గొన్నారు.

డిగ్రీ ఆనర్స్ కోర్సులపై అవగాహన



అధికారులను సత్కరిస్తున్న చాంబర్స్ కళాశాల యాజమాన్యం

పాలకొల్లు సెంట్రల్: ఎంత కష్టమైన సబ్జెక్టు అయినా మనకు ఇష్టంగా మార్చుకుని చదువుకోకపోతే భవిష్యత్ జీవితంలో అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆర్‌డీఓ దాసి రాజు అన్నారు. మంగళవారం స్థానిక ఛాంబర్స్ మొదటి సంవత్సరం డిగ్రీ ఆనర్స్ కోర్సులపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాసి రాజు మాట్లాడుతూ సామాన్య కుటుంబాల విద్యార్థులకు సైతం సామాజికంగా, ఆర్థికంగా ఒక మంచి హోదాను కల్పించేది విద్య ఒక్కటేనని అన్నారు. తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్ మాట్లాడుతూ విద్యార్థి దశలో డిగ్రీ మూడు సంవత్సరాలు అత్యంత కీలకమైనదని అన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కారుమూరి వెంకట నరసింహరావు, సెక్రటరీ కేవి సీతారామరాజు, దేవరపు లక్ష్మీనారాయణ, రేపాక ప్రవీణ్‌భాను, ప్రిన్సిపాల్ డా డి.వెంకటేశ్వరరావు, అడబాల వెంకటరమణ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండా సూరిబాబు

పెనుగొండ: భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మండా సూరిబాబు అన్నారు. ఈ నెల 18న భీమవరంలో జరగనున్న జిల్లా డెల్టా బిల్డింగ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్ యూనియన్ ఐదో మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం ఆచంటలో మహాసభల కరపత్రిన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేశాయని, ఈ సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు, కార్మికుల పిల్లలకు, కుటుంబాలకు అనేక సదుపాయాలతో పథకాలు అమలు చేశారన్నారు. అనంతకాలంలో ప్రభుత్వాలు ఈ సంక్షేమ బోర్డు నిధులను పక్కదారి పట్టించాలని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు అమలు చేయాల్సిన అనేక క్లెయిమ్‌లు పెండింగ్లో ఉన్నాయని వాపోయారు. కార్మికులకు ఉపాధిని కాపాడాలని, ప్రమాదాలకు గురైన కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి వివిధ వృత్తుల్లో ఉన్న భవన నిర్మాణ కార్మికుల్ని కదిలించి ఉద్యమించేందుకు, అవసరమైన కార్యచరణ ప్రణాళికను రూపొందించేందుకు ఈ మహాసభలు ఎంతగానో ఉపయోగపడతాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసిరెడ్డి కోటేశ్వరరావు, మండల నాయకులు కేత నాగాంజనేయులు, పూసల ఏడుకొండలు, బుల్లబ్బాయి, వెంకటేశ్వర్లు, ప్రసాద్, విగ్నేశ్వరుడు, సత్యనారాయణ, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తిల్లపూడిలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన



స్వచ్ఛ సర్వేక్షణ్ బృందంతో అధికారులు

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని తిల్లపూడి గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృంద సభ్యులు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్య పరిస్థితి, మురుగునీరు పారుదల, పచ్చదనం తదితరల అంశాలను పరిశీలించారు. అనంతరం పర్యటన జిల్లా టీం సభ్యురాలు ఎం.మధుమతి గ్రామంలో వ్యక్తిగత గృహాలను సైతం పరిశీలించారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్లు ఉన్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. ఇంటి పరిసరాల్లో పండ్లు, కాయగూరలు పెంచుతున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. వర్మీకంపోస్టను పనులను పరిశీలించారు. కార్యక్రమంలో స్వచ్ఛ సర్వేక్షణ్ సభ్యులు ఎన్.రవి కిరణ్, ఎం.సంతోష్ కుమార్, డిప్యూటీ ఎంపీడీఓ టి.మూర్తిబాబు, సర్పంచ్ నడపన శ్రీనివాస్, కామిశెట్టి రంగారావు, పాల ఏసు తదితరులు పాల్గొన్నారు.